క్లుప్తంగా

స్పీకర్‌ను కలిసిన మున్సిపల్‌ చైర్మన్‌



కల్వకుర్తి: ఛత్తీస్‌ఘడ్‌ మాజీ సీఎం, ప్రస్తుత స్పీకర్‌ రమణ్‌సింగ్‌ను కల్వకుర్తి మున్సిపల్‌ చైర్మన్‌ ఎడ్మ సత్యం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఛత్తీస్‌ఘడ్‌ రాష్ట్రంలో బాస్కెట్‌ బాల్‌ పోటీలలో మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న చైర్మన్‌ కుమారుడు రాంచంద్రారెడ్డితో కలిసి వెళ్లారు. టోర్నీకి ముఖ్య అతిథిగా ఆ రాష్ట్ర స్పీకర్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్‌ను కలిసి చైర్మన్‌ సన్మానించారు.

క్యాలెండర్‌ ఆవిష్కరణ

అచ్చంపేట: పట్టణంలోని రెడ్డి భవన్‌లో సోమవారం రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, గౌరవ సలహాదారులు డాక్టర్‌ గోవర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి

లింగాల: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ఇరుముడిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. అంతకు ఆలయంలో పడి పూజను, స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. స్వాములు శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు.

సమస్యలు పరిష్కరించాలి

తెలకపల్లి: ఉపాధి హామీలో పనిచేస్తున్న వివిధ గ్రామాలకు చెందిన మేట్ల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్‌ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మేట్లతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మేట్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.

మొక్కుబడిగా ప్రజావాణి

ఉప్పునుంతల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం నామ మాత్రంగా సాగుతోంది. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉన్నా ఒకటి రెండు శాఖలకు సంబంధించిన కిందిస్థాయి అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. వారు కూడా గంట సమయం కూర్చొని వెళ్లిపోతున్నారు. దీంతో స్థానికులు జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదులు చేయడానికి వెళ్తున్నారు.

22న సెలవు ప్రకటించాలి

అచ్చంపేట రూరల్‌: అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణంలో భాగంగా ఈ నెల 22న బాల రాముని ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించాలని విశ్వహిందూ పరిషత్‌ అచ్చంపేట ప్రఖండ అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

రక్షణ చట్టాలు అమలు చేయాలని వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్‌: దివ్యాంగుల రక్షణ చట్టాలు అమలు చేయాలని ఆ సంఘం హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి పుల్జాల బాలీశ్వర్‌, అధ్యక్షులు కోట్ల గౌతంలు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం కలెక్టర్‌ కార్యాలయంలో ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సదరం సర్టిఫికెట్‌, స్లాట్‌ బుకింగ్‌ సంఖ్యను మూడు నెలలకు ఒకేసారి కోటాను విడుదల చేయాలని కోరారు. పాండురంగ శర్మ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

తాడూరు: టాలెంట్‌ టెస్ట్‌ విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తిరుపతయ్య అన్నారు. దీనికి సంబందించిన సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం డీఈఓ గోవిందరాజులు జిల్లా కేంద్రంలో విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థి ప్రతిభ

వెల్దండ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో మండల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీర్ల ఆడిటోరియంలో సుమన్‌ ఆర్ట్స్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో పంచెస్‌ హై రేంజ్‌బుక్‌ వరల్డ్‌ రికార్డులో వెల్దండ జేఆర్‌ తైక్వాండో అసోసియేషన్‌కు చెందిన విద్యార్థులు ఆఫ్రీన్‌, శ్రీవాణి, అభినవ్‌, సాగర్‌, జాహంగీర్‌లు తమ సత్తచాటి పథకాలు సాధించారు. తైక్వాండో గ్రాండ్‌ మాస్టర్‌ జయంత్‌రెడ్డి, మాస్టర్లు ఎండీ ఖలీల్‌, నీరటి కుమార్‌, విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

అమ్రాబాద్‌: హైదరాబాద్‌ జింఖాన మైదానంలో మాస్టర్‌ గేమ్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో మండలంలోని జంగంరెడ్డిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బల్మూరి గోపాల్‌ లాంగ్‌ జంప్‌లో ద్వితీయస్థానం, ట్రిపుల్‌జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచాడు. సోమవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడిని తోడి ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం

- జీసీ హాస్టల్‌లో సమస్యలు తిష్ట
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఉప్పునుంతల బీసీ హాస్టల్‌ భవనం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో వెనకబడిన తరగతుల విద్యార్థుల సౌకర్యార్థం 20 ఏళ్ల కిందట బీసీ బాలుర వసతి గృహం ఏర్పాటు చేశారు. హాస్టల్‌ 6వ తరగతి నుంచి 10 తరగతి చదివే విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. గతంలో బీసీ హాస్టల్‌లో సీటు పొందేందుకు ఎంతో పోటీ ఉండేది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా 160 మంది విద్యార్థుల సామర్థ్యంగల ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 40 మందికి మించి విద్యార్థులు ఉండటం లేదు.

హాస్టల్‌లో సరిపడ వసతులులేక విద్యార్థులు సమస్యలతో సతమవుతున్నారు. దీంతో సమీప గ్రామాల నుంచి విద్యార్థులు ఇంటి నుంచే రాకపోకలు కొనసాగిస్తున్నారు. హాస్టల్‌లో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. కొన్నేళ్లుగా ఇన్‌చార్జ్‌ వార్డెన్లతో నామమాత్రంగా హాస్టల్‌ కొనసాగుతున్న పాలకులు గాని, సంబంధిత అధికారులు గానీ ఏమాత్రం పట్టించుకోవడలేదు. హాస్టల్‌ విద్యార్థులను వార్డెన్‌, అధికారులు పట్టించుకోకపోవడంతో వారి తల్లిదండ్రులు హాస్టల్‌ పంపించేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఉన్న విద్యార్థులకు కూడా మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు, మూడు రోజులు పాఠశాలలకు సెలవులు వచ్చాయంటే విద్యార్థులందరూ స్వంత ఊళ్లకు వెళ్లిపోతుండటంతో హాస్టల్‌లో పది మంది కూడా ఉండటం లేదు.



కిటికీ ఊడిపోవడంతో దుస్తులు అడ్డుగా పెట్టిన విద్యార్థులు

సమస్యలతో సతమతం..

దాదాపుగా 20 ఏళ్ల కిందట నిర్మించిన బీసీ హాస్టల్‌ భవనంలో తలుపులు, కిటికీలు సరిగ్గా లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం చలి తీవ్రతతో విద్యార్థులు విద్యార్థులు గజగజ వణికిపోతున్నారు. కిటికీలకు దుస్తులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. స్నానపు గదులు, మరుగుదొడ్లకు తలుపులు సరిగ్గా అమర్చలేదు. మరుగుదొడ్లను తరుచుగా శుభ్రం చేయకపోవడంతో కంపు వాసనను తట్టుకోలేకపోతున్నామని విద్యార్థులు వాపోయారు.

ప్రహరీ లేక విచ్చలవిడిగా..

హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు కనీసం పాఠశాలకు వెళ్తున్నారా లేదా అనే విషయాన్ని అడిగే వారే కరువయ్యారు. దీంతో విద్యార్థులు విచ్చలవిడిగా బయటకు వెళ్తూ వస్తున్నారు. అధికారులు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోని సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి. చుట్టూ ప్రహరీ లేక పశువులు, మేకలు, పందులు, విషపురుగులు ప్రవేశిస్తున్నాయి. ప్రహరీ ఉంటే బయటకు వెళ్లేందుకు వీలుండదు. తలుపులు, కిటికీలు సరిగ్గా లేకపోవడంతో చలికి ఇబ్బందిపడుతున్నాం. ఇక్కడ కనీసవసతులు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు హాస్టల్‌లో ఉండేందుకు ఇష్టపడటం లేదు.

– బాలరాజు, 9వ తరగతి హాస్టల్‌ విద్యార్థి

మెనూ పాటించడం లేదు..



కొన్ని నెలల నుంచి మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదు. పప్పుచారుతోనే సరి పెట్టుకుంటున్నాం. హాస్టల్‌ నిర్వహణపై అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. సరైన వాతావరణ లేకపోవడంతో చదవలేకపోతున్నాం. సెలవు వచ్చాయంటే ఇంటికి వెళ్తున్నాం. ఇక్కడ వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలి.

– రవితేజ, 10వ తరగతి హాస్టల్‌ విద్యార్థి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరుగుదొడ్లు, బాత్‌రూంలు సరిగా లేకపోతే స్వంత డబ్బులతో తాత్కాలికంగా బాగుచేయించి తరచూగా శుభ్రం చేయిస్తున్నాను. హాస్టల్‌ చుట్టూ ప్రహరీ లేక ఇబ్బందిగా పడుతున్నది వాస్తవమే. పాలకులు, ఉన్నతాధికారుల స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– రమేష్‌, బీసీ హాస్టల్‌, ఇన్‌చార్జ్‌, వార్డెన్‌

శ్రీరామ దివ్య అక్షతల పంపిణీ



లింగాలలో అక్షతలకు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కల్వకుర్తిరూరల్‌: అయోధ్య శ్రీరామ అక్షతలను సోమవారం ఇంటింటికి పంపిణీ చేశారు. మండలంలోని వేపూరు హనుమాన్‌ దేవాలయంలో పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఊరేగింపుగా గడపగడకు వెళ్లి అక్షతలను అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ నాయకులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో శ్రీరామ దివ్య అక్షతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరామ ట్రస్ట్‌ సభ్యురాలు శారద జ్యోతి, కవిత, విమల, రాధ, సంధ్య, సాయిలీల పాల్గొన్నారు.

కొల్లాపూర్‌: పట్టణంలో ఆలయాల కమిటీల నాయకులు, విశ్వహిందూ పరిషత్‌ నాయకులు ఇంటింటికీ తిరిగి అక్షతలను పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంట్లో 5 దీపాలు వెలిగించాలని సూచించారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోఓ అక్షతలను ఇంటింటికి అందజేశారు. శ్రీరాములు గౌడ్‌, రామకృష్ణ, నరేంద్రాచారి, రవికుమార్‌, రమేష్‌, రాఘవ, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో అక్షతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు, మహిళలు శ్రీరామ నామాన్ని జపిస్తూ గడపగడపకు వెళ్లి అక్షతలను పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో అక్షతలకు స్వాగతం పలికారు.



అచ్చంపేటలో..

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో భజరంగ్‌దళ్‌ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ అక్షతలు, రాముడి చిత్రపటాలను కూడా పంపిణీ చేశారు. భజరంగ్‌దళ్‌ మండల అధ్యక్షుడు పల్లె శివ, శేషేంద్ర ప్రసాద్‌, మూలె వెంకటేష్‌, బుడమోని రవి పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని కొట్రలో అయోధ్య అక్షతలకు హన్‌మాన్‌ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా భక్తి గీతాలను ఆలపిస్తూ ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఇంటింటికి అక్షతలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ రాములు, నాయకులు బాలస్వామి, శ్రీనివాస్‌యాదవ్‌, తదితరులు ఉన్నారు.

అచ్చంపేట: అచ్చంపేట పట్టణంలోని 9వ వార్డులోని మధురానగర్‌ కాలనీలో శ్రీరామ దివ్య అక్షతలను ఇంటింటికి పంపిణీ చేశారు. వీహెచ్‌పీ మహిళా విభాగం ఆధ్వర్యంలో శ్రీరాముడి చిత్రపటంతో ఊరేగింపుగా వెళ్లి అక్షతలు అందజేశారు. వేణు, భారతి, కె.మణి, చంద్రకళ, నిర్మల, గిరిజా, రేణుక, ఉమాదేవి, విద్యావతి, అనిత పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి

వెల్దండ: బంజారాల ఆరాధ్య దైవంగా ఉండే సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ జయంతి సందర్భంగా రూ.10 కోట్లు నిధులను మంజూరు చేయాలని సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌ శ్రీనువాస్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. జయంతి రోజు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మణ్‌ నాయక్‌, జయరాంనాయక్‌, శ్రీనునాయక్‌, రఘునాయక్‌, గాసిరాంనాయక్‌, తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

లింగాల: మండలంలోని దారారం సమీపంలో కోడి పందాల స్థావరం ఆదివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలోని పెద్ద వాగు ప్రాంతంలో కోడిపందెం ఆడుతున్నారని అందుకున్న సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. పందాలు ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జనరల్‌ ఆస్పత్రిలో వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్‌ క్రైం: జిల్లా కేంద్రంలో జనరల్‌ ఆస్పత్రికి చికిత్స కోసం మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన బిచ్చన్న(70) వచ్చాడు. ఆస్పత్రి ఆవరణలో పడుకొని అకస్మాత్తుగా సోమవారం మృతి చెందాడు. గమనించిన ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టంలో ఉంచినట్లు ఎస్‌ఐ మహేందర్‌ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కంప్యూటర్‌ చోరీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలో ఉన్న కంప్యూటర్‌ను ఎత్తుకెళ్లారని హెచ్‌ఎం వెంకటయ్య తెలిపారు. ఈ ఘటనపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

వాహనాల తనిఖీ

నాగర్‌కర్నూల్‌ క్రైం: జిల్లా కేంద్రంలోని నాగనూలు చౌరస్తా వద్ద సోమవారం రాత్రి డ్రంకెన్‌డ్రైవ్‌ నిర్వహించారు. తనిఖీలలో మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురు పట్టుబడ్డారని ఎస్‌ఐ రామేశ్వర్‌ రెడ్డి తెలిపారు.

బల్మూర్‌: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్‌ఐ కోరారు. మండల కేంద్రంలోని అచ్చంపేట–బల్మూర్‌ ప్రధాన రహదారిలో స్పెషల్‌ డ్రంకెన్‌డ్రైవ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేశారు.

గ్యారంటీ పథకాలతో పేదలకు మేలు



అచ్చంపేట రూరల్‌: గ్యారంటీ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్‌ అడ్వైజరీ కమిటీ మెంబర్‌, కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర నాయకుడు బొజ్జ అమరేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో ఆదివారం అమెరికాలోని వాషింగ్టన్‌ డీసీలో ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం సీఎం సోదరుడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, కొండారాం తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నాయకుల ధర్నా

కల్వకుర్తిరూరల్‌: పెండింగ్‌ ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌ మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకుడు సంతోష్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌ కవితకు వినతిపత్రం అందజేశారు. పవన్‌, హాజిల్‌, రాము, సమీర్‌, సాయి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

కందనూలు: వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో అధికారి గోవిందరాజులును సమగ్ర శిక్ష ఉద్యోగులు వినతి పత్రాన్ని అందజేశారు. సమగ్రశిక్షలో 750 మంది సిబ్బంది పనిచేస్తున్నారని నవంబర్‌ నుంచి జీతాలు చెల్లించడం లేదని వివరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరల్‌ అధికారులు బరపటి వెంకటయ్య, సూర్య చైతన్య, షర్ఫుద్దీన్‌, నరుద్దీన్‌, వెంకటేశ్వర్‌ రెడ్డి, సిబ్బంది ప్రేమలత, పాషా, ఆంజనేయులు, వెంకట్‌ కుమార్‌, శ్రీకాంత్‌, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

దేవనాథ జీయర్‌ స్వామికి ఘన స్వాగతం



మాట్లాడుతున్న దేవనాథ జీయర్‌ స్వామి

అచ్చంపేట రూరల్‌: పట్టణంలో త్రిదండి దేవనాథ జీయర్‌ స్వామికి సోమవారం భక్తులు ఘన స్వాగతం పలికారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ధార్మిక సమ్మేళనం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రాముడి అక్షతలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్రాబాద్‌ జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్‌ అనురాధ, వికాస తరంగిణి సభ్యుడు గోపాల్‌యాదవ్‌, భక్తులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్‌ సమావేశం

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉన్నత, ప్రాథమికోన్నత స్థాయి బయో సైన్స్‌ కాంప్లెక్స్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల, బల్మూర్‌, ఉప్పునుంతల, అచ్చంపేట, పదర, అమ్రాబాద్‌ మండలాల సైన్స్‌ బోధకులతో పాటు కేజీబీవీ బోధకులు పాల్గొన్నారు. ఆయా అంశాలపై ఆర్పీ సుబ్బయ్య అవగాహన కల్పించారు. హెచ్‌ఎం తాహెర్‌పాషా, సీఆర్పీలు, ఆయా మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కోడేరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీడీఓ బాలచంద్ర సృజన అన్నారు. సోమవారం ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్‌ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఉస్సేన్‌, మాజీ వార్డు సభ్యులు రాజు, సురేష్‌, జగన్‌, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

నాగర్‌కర్నూల్‌ క్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని మహిళలు రాత్రివేళ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సోమవారం ఆర్టీసీ డీఎం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బస్టాండ్‌లో బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం



క్యాంపు కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: పట్టణంలో క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో వాస్తుపూజ, సత్యనారాయణస్వామి వ్రతాన్ని సతీసమేతంగా నిర్వహించారు. పోలీసులు, ఇతర శాఖల అధికారులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మాజీ సర్పంచ్‌ ఆనంద్‌కుమార్‌, రమణారెడ్డి, సురేందర్‌ రెడ్డి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

తాడూరు: మండల కేంద్రంలోని పరిషత్‌ కార్యాలయ సిబ్బంది సోమవారం అభయ హస్తం దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేయడంలో నిమగ్నమయ్యారు. 24 గ్రామపంచాయతీలకు మొత్తం 14267 దరఖాస్తులు వచ్చాయని వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీఓ గంగమోహన్‌, ఎంపీఓ లక్ష్మణ్‌ నాయక్‌లు తెలిపారు. రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

వెల్దండ: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌ నమోదు వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్‌ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సలహాలు, సూచనలు అందజేశారు. మండలంలో మొత్తం 32 గ్రామ పంచాయతీలకు 13046 దరఖాస్తులు అందాయని ఇప్పటి వరకు 2867 దరఖాస్తులు ఆన్‌లైన్‌ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్‌ మోహన్‌లాల్‌, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

పెంట్లవెల్లి: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందని జగద్గురు గాయత్రీ పీఠాధిపతి శ్రీకాంతేంద్ర స్వామి అన్నారు. సోమవారం మండలంలోని మల్లేశ్వరంలో అగస్తేశ్వర లింగానికి పీఠాధిపతి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ తిరుపాటి నాగరాజు, నారాయణెడ్డి, పోతుల వెంకటేశ్వర్లు, శ్రీహరి, శ్రీను, రొడ్డ నాగేష్‌, శేఖర్‌, కుర్మయ్య, వెంకటేశ్వర్లు, నడిపన్నలు పాల్గొ



అగస్తేశ్వర లింగానికి పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి శ్రీకాంతేంద్రస్వామి

భక్తిభావంతో మెలగాలి



పూజలు నిర్వహిస్తున్న ఉప్పల వెంకటేష్‌

కల్వకుర్తిరూరల్‌: సమాజంలోని ప్రతి ఒక్కరు కుల మతాలకు అతీతంగా భక్తిభావంతో మెలగాలని తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల చారిటబుల్‌ చైర్మన్‌ ఉప్పల వెంకటేష్‌ కోరారు. సోమవారం మండలం జిల్లెల్ల, యంగంపల్లి గ్రామ శివారులో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా ఐక్యతా ఫౌండేషన్‌ ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి ఐక్యతా ఫౌండేషన్‌ ద్వారా రూ.1.40 లక్షలు అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లెల్ల సర్పంచ్‌ జంగయ్య, యంగంపల్లి సర్పంచ్‌ యాదగిరి రెడ్డి, ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, సత్యం, శ్రీకాంత్‌రెడ్డి, రవి, బీరయ్య, దారమోని గణేష్‌, పూరి రమేష్‌, కిషోర్‌ పాల్గొన్నారు.

దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలి

కల్వకుర్తిరూరల్‌: నియోజకవర్గంలో దొంగతనాలను, నేరాలను అదుపుచేయాలని జాతీయ బీసీ కమిషన్‌ మాజీ సభ్యుడు ఆచారీ డిమాండ్‌ చేశారు. సోమవారం డీఎస్పీ పార్థసారధిని కలిసి దొంగతనాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెల్దండ మండలం కొట్ర, కుప్పగండ్ల, తిమ్మనోనిపల్లి, నారాయణపూర్‌ తదితర గ్రామాలలో రాత్రి వేళల్లో తరుచుగా దొంగతనాలు జరుగుతున్నాయని వివరించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు శేఖర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, దుర్గా ప్రసాద్‌, బాలాగౌడ్‌ తదితరులతో పాటు పలువురు ఉన్నారు.

వెల్దండ: దొంగతనాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు ఆచారి అన్నారు. మండలంలోని కొట్రలో కడారి పార్వతమ్మ నివాసంలో ఇటీవల గుర్తు తెలియని దొంగలు బంగారు, నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆచారి బాధితురాలు ఇంటికి వెళ్లి వివరాలను అడిగి తెసుకున్నారు. మాజీ సర్పంచ్‌ జంగయ్య, శేఖర్‌రెడ్డి, బాలస్వామి, జంగయ్యయాదవ్‌, రామచెంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, పరమేష్‌గౌడు తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆచారి

పత్తి అవశేషాలపై క్షేత్ర అవగాహన



అవగాహన కల్పిస్తున్న పాలెం శాస్త్రవేత్తలు

తాడూరు: మండలంలోని యత్మతాపూర్‌లో పత్తి అవశేషాల యాజమాన్యంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం పాలెం ఆధ్వర్యంలో సోమవారం కాటన్‌ ష్రెడ్డర్‌ ప్రదర్శనపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ డాక్టర్‌ పి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పత్తి తీసిన అనంతరం పంట అవశేషాలను అలాగే వదిలేయడం, కాల్చివేయడం చేయొద్దన్నారు. పత్తితీసిన వెంటనే ష్రెడ్డర్‌తో భూమిలో కలిపివేస్తే నేలను చదును చేసుకోవచ్చు అన్నారు. దీంతో నేల సారవంతం అవుతుందని వివరించారు. డ్రమ్‌ సీడర్‌ ద్వార వరి నేరుగా విత్తుకున్నట్లయితే పంట దిగుబడి, ఖర్చు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రామకృష్ణ, ఏఓ రమేష్‌ రెడ్డి, ఏఈఓ కార్తీక్‌, ఉత్తమ రైతు నాగిరెడ్డి, జైపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కల్వకుర్తి టౌన్‌: పట్టణంలోని త్రివేణి విద్యాలయం 2003–04 బ్యాచ్‌ సోమవారం పూర్వవిద్యార్థుల సమ్మేలనం నిర్వహించారు. ఈ సందర్భంగా గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.